ప్రజాశక్తి

మంగళవారం 2 డిసెంబర్ 2025

5

పార్వతీపురం మన్యం

5న జిల్లాకు సిఎం రాక

ప్రజాశక్తి-భామిని

ఈ నెల ఐదో తేదిన పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనకు సిఎం చంద్రబాబునాయుడు రానున్నారు. భామిని మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించే మెగా పేరెంట్స్, టీచర్స్ కార్యక్రమానికి సిఎం హాజరుకానున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన వివరాలను సిఎంఒ కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది. సిఎం పర్యటన ఖరారు కావడంతో సమగ్ర శిక్ష రాష్ట్ర అధికారులు బి.శ్రీనివాసరావు, దేవానంద్, జెసి యశ్వంత్ కుమార్ రెడ్డి సోమవారం ఆదర్శ పాఠశాలను సందర్శించారు.

ప్రభుత్వ మెట్ట చుట్టూ కంచె

- ఆక్రమణదారుల పై ఫిర్యాదు చేసినా కానరాని చర్యలు
- కొమ్ముకాస్తున్న మండల తహశీల్దార్
- ఫిర్యాదుదారుల్ని బెదిరిస్తున్న అధికార పార్టీ నాయకులు

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, గ్రామస్తులు

ప్రజాశక్తి-పార్వతీపురం

బలిజిపేట మండల పరిధిలోని ప్రభుత్వ మెట్టని కొంతమంది స్థానికులు కబ్జా చేసి చుట్టూ కంచె నిర్మించడం వివాదాస్పద మవుతోంది. స్థానిక అధికారపార్టీ నాయకుల అండదండలతో బలిజిపేట మండల కేంద్రంలో మెట్టకాలనీలో పలగర రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 32/2లో ఉన్న భూమిరాయి మెట్ట చుట్టూ ఇనుప కంచె నిర్మాణం చేపట్టారు. దీనిపై జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఇప్పటికే మూడు సార్లు ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలకు వెనుకాడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. తహశీల్దార్ బాలమురళీకృష్ణ అధికారపార్టీ నాయకులకు కొమ్ము కాస్తూ భూమి రాయి మెట్ట చుట్టూ ఉన్న కంచెను తొలగించకుండా డ్రామాలాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో సబ్ కలెక్టర్ వైశాలి ఈ ఆక్రమణను పరిశీలించి తొలగించాలని తహశీల్దార్ బాలమురళీకృష్ణని ఆదేశించారు. ఆ మేరకు తొలగించినట్లు తహశీల్దార్ ఫిర్యాదుదారులకు లిఖితపూర్వక వివరణ ఇచ్చారు. కానీ ఇంతవరకు భౌతికంగా కంచెను మాత్రం తొలగించలేదు. ఈ వ్యవహారంలో ఫిర్యాదుదారులను స్థానిక టిడిపి నాయకులు బెదిరిస్తున్నారు. భౌతిక దాడులకు కూడా దిగుతున్నారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అండతోనే స్థానిక టిడిపి నాయకులు భూమి రాయి మెట్టని ఆక్రమణకు యత్నించినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారులు, టిడిపి నాయకులకు పెద్ద ఎత్తున డబ్బులు ముట్టాయనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇంతవరకు మూడు సార్లు జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతులు అందజేసినా అధికారులు స్పందించకపోవడంతో ఫిర్యాదు దారులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో వారు సిపిఎంని ఆశ్రయించి పోరాటం చేస్తున్నారు.

ఆక్రమణ తొలగించాలని ధర్నా

బలిజిపేట మండలం పలగర రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 32/2 భూమి రాయి మెట్ట చుట్టూ కంచె తొలగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, జిల్లా నాయకులు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామస్తులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలిజిపేటలోని మెట్టకాలనీలో పలగర రెవెన్యూలో సర్వే నం 32/2 భూమిరాయి మెట్ట చుట్టూ కంచె వేసి ఆక్రమించారని చెప్పారు. ఇనుప కంచె తొలగించంచాలని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తే ఆ ఫిర్యాదుదారుల పేర్లను బలిజిపేట తహశీల్దార్ టిడిపి నాయకుడు రామారావుకు వాట్సాప్‌లో పెడుతున్నారని చెప్పారు. ఆ వెంటనే టిడిపి నాయకుడు రామారావు ఫిర్యాదుదారుల ఇళ్లకు వచ్చి బెదిరిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ భూమి ఆక్రమించారని ఫిర్యాదు చేసిన వారిని బెదిరించి దౌర్జన్యం చేయడం అన్యాయమని అన్నారు. ప్రజావసరాల కోసం కేటాయించిన రాయిమెట్టని కొంతమంది ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టడం సమంజసం కాదని చెప్పారు. ఈ మెట్టపై మంచినీటి ట్యాంకు నిర్మించాలని ప్రభుత్వ అధికారులు నిర్ణయించారని గుర్తుచేశారు. ప్రజల అవసరాల కోసం ఆ మెట్టని ఖాళీగా ఉంచాలని డిమాండ్ చేశారు.

మక్కువ.. పొలంలో తడిసిన వరిచేను

ఎడతెరిపి లేని వాన

రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి- కురుపాం

దిత్వా తుపాను ప్రభావంతో సోమవారం తెల్లవారుజాము నుంచి కురుపాం మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో రైతన్నల గుండెల్లో గుబులు మొదలైంది. ఈ ఏడాది మండలంలో అధికంగా రైతులు పండించిన వరి ప్రస్తుతం కోతదశలో ఉంది. ప్రస్తుతం తుపాను కారణంగా కురుస్తున్న వర్షానికి ధాన్యం తడిచిముద్దవుతుందోననే భయం పట్టుకుంది. వర్షం అధికంగా పడితే పంట నేలకొరిగి, ధాన్యం రాలిపోయి నష్టం వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నూర్పిడి చేసిన ధాన్యాన్ని కళ్లాల్లో కాపాడుకునేందుకు నానాపాట్లు పడ్డారు.

మక్కువ : మండలంలోని శనివారం రాత్రి నుంచి చిరుజల్లులు కురుస్తున్నాయి. దీంతో వరిచేను కోసి పొలాల్లో ఉన్న చోట తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన చోట ధాన్యం రంగు మారకుండా ఉండేందుకు ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని ఎఒ సిహెచ్ భారతి రైతులకు సూచించారు.

వీరఘట్టంలో వర్షం

వీరఘట్టం : దిత్వా తుపాను ప్రభావంతో ఆదివారం అర్ధరాత్రి నుంచి మండలంలో వర్షం పడింది. సోమవారం ఉదయం కూడా మబ్బు కాస్తూ వర్షం పడటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే నడుకూరు, కిమ్మి, కొట్టుగుమ్మడ, గడగమ్మ, చిదిమి, యు.వెంకంపేట, పివిఆర్‌పురం, తూడి, విక్రమపురం, చిట్టిపూడివలస గ్రామాల్లో వరికోతలు మొదలయ్యాయి. ఈ పరిస్థితిలో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు ఉన్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని యు.వెంకంపేట, హుస్సేనుపురం గ్రామాల్లో సోమవారం ఎఒ సౌజన్య పర్యటించారు. కోత కోసిన పంటను ఓవులుగా ఉంచకుండా చిన్న కుప్పలు వేసుకొని వాటిపై టార్పాలిన్లు కప్పాలని రైతులకు సూచించారు.

వీరఘట్టం.. రైతులకు సూచనలిస్తున్న ఎఒ సౌజన్య

ఉద్యోగాలిస్తామని చెప్పి గిరిజనులకు టోకరా

- నకిలీ పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చి మోసం
- రూ.లక్షలు గుంజుకున్న ఏజెన్సీ నిర్వాహకులు

ప్రజాశక్తి-పార్వతీపురం

మన్యం జిల్లాలో ఉద్యోగాలు ఇస్తామని చెప్పి రూ.లక్షలు గుంజుకున్న ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కురుపాం నియోజకవర్గంలో ఇద్దరు నిరుద్యోగ యువకుల నుంచి చెరో రూ.2.5 లక్షలు తీసుకుని నకిలీ పోస్టింగ్ ఆర్డర్‌లిచ్చిన వ్యవహారం తాజాగా తెరపైకి వచ్చింది. భారత్ సేవక్ సమాజ్ అనే సంస్థ పేరుతో విహెచ్.శ్రీదేవి, టి.వీరయ్యలకు పోస్టింగ్ ఆర్డర్ ఇచ్చారు. కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎఎన్‌ఎం ఉద్యోగం, దుడ్డుఖల్లు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నైట్ వాచ్‌మన్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఏజెన్సీ నిర్వాహకులు మోసం చేశారు. వాటిని తీసుకుని సంబంధిత పాఠశాలలకు వెళ్లిన తరువాత వారికి అవి నకిలీ ఆర్డర్‌లని తెలియడంతో లబోదిబోమంటున్నారు. మరిశర్ల సతీష్ కుమార్ అనే వ్యక్తి పేరిట ఉన్న హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఖాతాలో వారు ఉద్యోగాలకు డబ్బు జమ చేశారు. కొంత డబ్బు ఫోన్ పే ద్వారా కూడా చెల్లించినట్లు చెపుతున్నారు. ఈ మేరకు మోసపోయిన ఇద్దరు కురుపాం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డికి కూడా శుక్రవారం గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి కొన్ని ఏజెన్సీల పేరుతో ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి గిరిజన నిరుద్యోగ యువతని మోసం చేస్తున్నారు. జిల్లా అధికారులు గిరిజన యువతకు మోసపూరిత సంస్థలపై అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

మరుగుదొడ్లు నిర్మించాలని ధర్నా

పార్వతీపురం : సాలూరు మండలం కొత్తవలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించాలని గ్రామానికి చెందిన మహిళలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో 45 మంది విద్యార్థులు చదువుతున్నారని, టాయిలెట్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని మహిళలు చెప్పారు. పిల్లలు రోడ్ దాటి బయటకు వెళ్లే సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల భవనం కూడా శిథిలావస్థలో ఉందని వివరించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, చొక్కాపు జయ లక్ష్మి, చుక్క దీపిక, ఉయ్యాల లక్ష్మీకోట ప్రశాంతి, సీతమ్మ, రూపావతి పాల్గొన్నారు.

సైకిల్ తొక్కుతున్న మంత్రి సంధ్యారాణి

గంజాయి సాగును అరికట్టేందుకు చర్యలు

మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు

గంజాయి సాగును అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే చర్యలు తీసుకుందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పోలీసు శాఖ చేపట్టిన అభ్యుదయం సైకిల్ యాత్రను పట్టణంలో సోమవారం మంత్రి ప్రారంభించారు. మంత్రి స్వయంగా సైకిల్ తొక్కుతూ, 'డ్రగ్స్ వద్దు బ్రో - వద్దే వద్దు బ్రో, డ్రగ్స్ వద్దు - చదువే ముద్దు.. వంటి నినాదాలతో యువతను ఉత్తేజపరిచారు. డ్రగ్స్‌తో జీవితం నాశనమవుతుందని, యువత తక్షణమే మానేసి, అమ్మ నాన్న చెప్పిందే విందామంటూ వివరించారు. క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత పెంపుపై యువత దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌పి మాధవ రెడ్డి, పట్టణ, రూరల్ సిఐలు బి.అప్పలనాయుడు, పి.రామకృష్ణ, ఎఎంసి చైర్మన్ ముఖి సూర్యనారాయణ, టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళని వేధిస్తారా?

- మంత్రి కుమారుడిపై కేసు నమోదు చేయాలి
- మాజీ పిఎ సతీష్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలి : ఐద్వా

మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి-పార్వతీపురం

ఇటీవల సాలూరుకు చెందిన ఒంటరి మహిళా ఉద్యోగి ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో పోలీసులు ఆమెనే వేధింపులకు గురి చేయడం అన్యాయమని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి శ్రీదేవి, బి.లక్ష్మి ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి సంధ్యారాణి మాజీ పిఎ సతీష్, కుమారుడు తనను మానసికంగా, శారీరకంగా వేధించారని పేర్కొంటూ ఒంటరి మహిళా ఉద్యోగి జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆధారాలతో సహా ఆమె పిర్యాదు చేశారని చెప్పారు. ఈ వ్యవహారంలో మంత్రి మాజీ పిఎ సతీష్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు ఇంతవరకు అరెస్టు చేయలేదన్నారు. వైద్య పరీక్షల పేరుతో బాధిత ఒంటరి మహిళని వేధించడం సమంజసం కాదన్నారు. ఆమె సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు మాజీ పిఎ సతీష్, మంత్రి కుమారుడు ఫోన్లను ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. మంత్రి కుమారుడిపైనా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తీవ్రమైన లైంగిక వేధింపులకు సంబంధించిన ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై కేసులు నమోదు చేయకుండా తాత్సారం చేయడం సరికాదన్నారు. నిందితులు దర్జాగా తిరుగుతుంటే న్యాయం కోసం ఫిర్యాదు చేసిన ఒంటరి మహిళని ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. ఈ విషయంలో తప్పు చేసిన వారిని శిక్షిస్తామని చెప్పకుండా ఒంటరి మహిళని బెదిరించే విధంగా మంత్రి సంధ్యారాణి వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. ఒంటరి మహిళకు న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళకు న్యాయం జరగకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎం.గౌరమ్మ పాల్గొన్నారు.

అమ్మా బాగున్నారా... ఇదిగో మీ పింఛను

ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేసిన్ల కలెక్టర్

ప్రజాశక్తి-సీతానగరం

అమ్మా బాగున్నారా? అయ్యా బాగున్నారా? ఇదిగో మీ పింఛను! అంటూ ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేసి అవ్వా, తాతల బాగోగులను కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అందుకే ప్రతినెలా ఇంటింటికీ వెళ్లి సామాజిక పింఛన్లను పంపిణీ చేస్తున్నామని అన్నారు. సీతానగరం మండలం సూరంపేటలో సోమవారం సామాజిక పింఛన్లను ఆయన ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. అవ్వా, తాతలు, వితంతువులు, వికలాంగులతో మమేకమై బాగోగులు అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,39,593 మంది పింఛనుదారులకు రూ.59.49 కోట్ల నగదును అందజేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి పింఛను నగదు అందజేస్తున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

నిరసన తెలుపుతున్న మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు, కార్మికులు

హామీలు అమలు చేయాలని

మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-పాలకొండ

హామీలను అమలు చేయాలని , నగర పంచాయతీలు కార్మికులకు రెండు నెలల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని పాలకొండ కమిషనర్‌కి అందజేశారు. అనంతరం ఫెడరేషన్ నాయకులు వై.హరిబాబు, సంజీవి మాట్లాడుతూ క్రిస్మస్, సంక్రాంతి దృష్ట్యా ప్రత్యేక నిధులు తెప్పించైనా కార్మికుల ఆకలి బాధలు తీర్చాలని డిమాండ్ చేశారు. సమ్మె కాలానికి వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ విరమణ పొందిన వారి కుటుంబాల పిల్లలకు వెంటనే ఉద్యోగాలు ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పురపాలక శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరికీ ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర పూర్తవుతున్నా నేటికీ పిఆర్‌సి ఊసే లేదని, దీంతో కార్మికులు వేతనాలు పెరగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమ్మె సందర్భంగా జీతాలు పెంపుదల, మట్టి ఖర్చులు పెంచడం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించడం, ఇతర సమస్యలపై ఇచ్చిన హామీలపై ప్రభుత్వం జిఒలు విడుదల చేసి, అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజేష్, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఫెడరేషన్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు టి.శంకరరావు, టి.రవి, కోశాధికారి రాముడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిఆర్‌సి వెంటనే ప్రకటించి పురపాలక సంఘాలలో ఉన్న కాంట్రాక్టు కార్మికుల జీతాలు వెంటనే పెంచాలన్నారు. సమ్మె కాలపు ఒప్పందాల ప్రకారం జిఒలు విడుదల చేసి అమలు చేయాలని డిమాండ్‌చేశారు. సమాన పనికి సమాన జీతం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, శ్యామలమ్మ, పార్వతి పాల్గొన్నారు.

అర్జీదారుల సంతృప్తే ప్రథమ కర్తవ్యం

- ఎట్టి పరిస్థితుల్లో అర్జీ పునఃప్రారంభం కారాదు
- కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి
- పిజిఆర్‌ఎస్‌కు 69 వినతులు

పిజిఆర్‌ఎస్‌లో సమస్యను వివరిస్తున్న ఆశావర్కర్స్ యూనియన్, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-పార్వతీపురం

అర్జీదారుల సంతృప్తే ప్రథమ కర్తవ్యంగా భావించి, జిల్లా అధికారులు అర్జీల పరిష్కారాన్ని చూపాలని కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన పిజిఆర్‌ఎస్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మొత్తం 69 వినతులు అందాయి. అందులో రెవెన్యూ 31, సాధారణ అర్జీలు 38గా ఉన్నాయి. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు చిత్తశుద్ధితో అర్జీలను పరిష్కరించాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అర్జీ పునః ప్రారంభం కారాదన్నారు. అర్జీ పరిష్కారం కాకపోవడానికి గల సరైన కారణాలను అర్జీదారులకు వివరించాలని సూచించారు. పరిష్కారమైనా, కాకున్నా మీరిచ్చే సమాధానంతో అర్జీదారు సంతృప్తి చెందాలని తేల్చి చెప్పారు.

అర్జీల వివరాలు ఇలా..

గుమ్మలక్ష్మీపురం మండలం వనకాబడి గ్రామంలో సాగు చేసుకుంటున్న కొండ పోడు భూములకు ఆధార్ లింక్ చేయాలని జె.జానకి, ఇతరులు అర్జీ అందజేశారు.

బలిజిపేట మండలం మురగదాం గ్రామ రెవెన్యూ పరిధిలో వ్యవసాయ భూములపై ఆక్రమణలు తొలగించాలని ఎస్.వెంకటరావు వినతిపత్రం సమర్పించారు.

పార్వతీపురం పట్టణానికి చెందిన బి.స్వప్నసుధ బైపాస్ రోడ్డులో ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్ నెంబర్ 27, లేఅవుట్ నెంబర్ 296/2019/సిలో ఉన్న ఇంటి స్థలాన్ని చూపించాలని కోరారు.

పార్వతీపురం మండలం చల్లావలస గ్రామ పరిధిలో ఉన్న భూమిని వేరేవాళ్లు ఆక్రమించారని, వారిపై తమ చర్యలు తీసుకోవాలని బి.నారాయణ విన్నవించారు.

వీరఘట్టం మండలం దశమంతపురం గ్రామానికి చెందిన వి.ప్రభాకరరావు తన సొంత భూములు 20 సెంట్లు, 7 సెంట్లు వేరే వారి పేరిట నమోదైందని, ప్రభుత్వం రీసర్వే చేసి తప్పులను సవరించాలని అర్జీ అందజేశారు.

మక్కువ మండలం బీరమాసి గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదని, గ్రామస్తులు, గర్భిణులు ఆసుపత్రికి వెళ్లటానికి చాలా ఇబ్బంది పడుతున్నారని, రోడ్డు సౌకర్యం కల్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సిహెచ్.ఉత్తర, ఇతరులు దరఖాస్తు అందజేశారు.

తమ గ్రామ పంచాయతీ తోటపల్లి బ్యారేజ్ ముంపునకు గురైందని, అడ్డాపుశీల పంచాయతీలో గ్రామాన్ని విలీనం చేశారని, పంచాయతీ దూరంగా ఉన్నందున ప్రభుత్వ సౌకర్యాలు సకాలంలో అందక ఇబ్బంది పడుతున్నామని పార్వతీపురం మండలం కోటవానివలసలో నూతనంగా పంచాయతీ ఏర్పాటుచేయాలని సర్పంచ్ పి.శివున్నాయుడు వినతి పత్రం సమర్పించారు.

కొమరాడ మండలం కుమ్మరిగుంట గ్రామానికి చెందిన పి.గౌరీ శంకరరావు తన ఇద్దరు కుమార్తెలు సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధితో బాధపడుతున్నారని ప్రభుత్వం ఆర్థిక సాయం, పింఛను మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తూరుమామిడి ఎఎన్‌ఎంపై చర్యలు తీసుకోవాలి

పార్వతీపురంటౌన్ : మక్కువ మండలం తూరుమామిడిలో ఆశా వర్కర్‌పై దాడి చేసిన ఎఎన్‌ఎం లక్ష్మిపై చర్యలు తీసుకోవాలని ఆశా వర్కర్ యూనియన్ నాయకులు వి.ఇందిర, జిల్లా కార్యదర్శి శివాని పిజిఆర్‌ఎస్‌లో డిఆర్‌ఒ హేమలతకు ఫిర్యాదు చేశారు. ఆశాకార్యకర్త గంట శ్రీదేవిపై ఎఎన్‌ఎం పిరిడి లక్ష్మి బూతులు తిడుతూ ఇష్టం వచ్చినట్లు కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలోనూ వేధింపులకు గురిచేశారని చెప్పారు. ఈ విషయమై గతంలో మక్కువ మెడికల్ ఆఫీసర్‌కి, జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేశామని గుర్తుచేశారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి గంగు నాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, గొర్లి వెంకటరమణ, బంకురు సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ మహమ్మారి అంతం

వివక్ష రహిత సమాజం కోసం కృషి చేయండి : కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

ప్రజల్లో అవగాహనతోనే ఎయిడ్స్ మహమ్మారిని అంతం చేయగలమని కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి స్పష్టంచేశారు. వివక్ష లేని సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని, ఇది వ్యాధి నియంత్రణకు తొలిమెట్టని ఉద్ఘాటించారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో ఎయిడ్స్ అవగాహన ర్యాలీని పార్వతీపురం పట్టణంలో సోమవారం నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవి బాధితుల పట్ల సమాజంలో నెలకొన్న వివక్షను, అసమానతలను విడనాడాలని అన్నారు. హెచ్ఐవితో జీవిస్తున్న వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటూ, వారిని ఆదుకుంటుందని తెలిపారు. ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత జీవన విధానాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి ఎం.వినోద్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్.భాస్కరరావు, ప్రోగ్రాం మేనేజర్ టి.జగన్మోహనరావు, డిసిహెచ్ఎస్ జి.నాగభూషణరావు, జిల్లా అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ కె.సందీప్ ఆధ్వర్యంలో విద్యార్థులు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బందితో ర్యాలీ చేపట్టారు. సిహెచ్‌సి నుంచి బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి, అనంతరం మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఆశా, వాసు, సృజన, ఐసిటిసి కౌన్సిలర్ మోహన, విద్యార్థులు పాల్గొన్నారు.

సాలూరు : మండలంలోని కురుకుట్టి, తోణాం గ్రామాల్లో, వసతిగృహాల్లో ఎయిడ్స్‌పై తోణాం పిహెచ్‌సి వైద్యులు ఎ.అజయ్ ఆధ్వర్యాన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ మధుసూదనరావు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీరఘట్టం : వీరఘట్టం, పివిఆర్‌పురం, తదితర గ్రామాల్లో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీలు చేపట్టారు. కార్యక్రమంలో వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్, సాయికుమార్, సూపర్వైజర్లు, ప్రధానోపాధ్యాయులు సంపత్ కుమార్, ఎంఎల్‌హెచ్‌పి రామకృష్ణ, జనార్ధన్ రావు, సురేష్, పద్మావతి, సరస్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ కమిషనర్ టిటి రత్నకుమార్ ఆధ్వర్యాన ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ శివప్రసాద్, మున్సిపల్ డిఇ ప్రసాదరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావేటి బాలకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్ డే కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ సుశాంత్ జన ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రభాకర్‌రావు, అధ్యాపకులు శంకరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని తాడికొండ గ్రామంలో స్థానిక పిహెచ్‌సి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఎయిడ్స్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు సింహాచలం, భారతి, ఆరోగ్య కార్యకర్తలు ఎస్‌వి ప్రకాశ్, బి.లక్ష్మణ, ఎఎన్ఎంలు ఎం.ప్రభావతి, అర్చన, ధనలక్ష్మి, మీనాక్షి, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: సీతానగరం పిహెచ్‌సి వైద్యులు శిరీష, ఉషారాణి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ దాలినాయుడు ఆధ్వర్యాన ర్యాలీ చేపట్టారు. హనుమాన్ జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించారు. బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పెదంకలాం పిహెచ్‌సి వైద్యులు పి.శ్రీకాంత్ అవగాహన సదస్సు నిర్వహించారు.

మక్కువ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పిహెచ్‌సి వైద్యాధికారులు ఎల్.శివాజీనాయుడు ఆధ్వర్యాన విద్యార్థులకు హెచ్ఐవిపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ మంజుల వీణ, వైద్య, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురంలో ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, డిఎంహెచ్ఒ భాస్కరరావు, ఇతర ఉన్నతాధికారులు, విద్యార్థులు

కురుపాంలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది, విద్యార్థులు ; వీరఘట్టం.. ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు

5న మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్

ప్రజాశక్తి-పార్వతీపురం

ఈ నెల 5వ తేదీన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ జరగనుందని, ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి పిలుపునిచ్చారు. మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌పై సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశం తల్లిదండ్రులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ప్రతి విద్యార్థి విద్యాప్రమాణాలను ఆయా ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకునే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమానికి విచ్చేసే వారందరికీ మధ్యాహ్న భోజనం కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పిల్లల తల్లిదండ్రులతోపాటు ఎస్ఎంసి మొత్తం హాజరవుతారని తెలిపారు. కేవలం టీచర్లు మాత్రమే కాకుండా తల్లిదండ్రులు కూడా పిల్లల ఎదుగుదలలో భాగస్వాములు కావాలని కోరారు.

వినతి అందిస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు గేదెల సత్యనారాయణ, రైతులు

మద్దతుధరకు ధాన్యం కొనాలి

ప్రజాశక్తి-బలిజిపేట

ధాన్యం మద్దతుధరకు వెంటనే కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు గేదెల సత్యనారాయణ.. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిటి శ్రీనివాసరావుకు వినతి అందించారు. మిల్లర్లు రైతులను దగా చేస్తున్నారని, 40 కిలోల బస్తాకు అదనంగా 2 కిలోలు వసూలు చేస్తున్నారని వివరించారు. ఇంత జరుగుతున్నా పౌరసరఫరాల అధికారులు పట్టించుకోక పోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో రైతులు సింహాద్రినాయుడు, పాపినాయుడు, రవణ, పైలప్రసాద్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అశ్వినీదేవికి డాక్టరేట్

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండకు చెందిన ఆగూరు అశ్వినీదేవికి డాక్టరేట్ లభించింది. వరంగల్ నిట్ ఇటీవల ఆమెకు పిహెచ్‌డి ప్రదానం చేసింది. ప్రస్తుతం అశ్వినీదేవి అమరావతిలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. అశ్వినీదేవి తండ్రి అగూరు పార్వతీశ్వర రావు ఉపాధ్యాయులుగా పనిచేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. అశ్వినీదేవికి నిట్ డైరెక్టర్ డాక్టర్ బిద్యాధర్ సుబుద్ధి డాక్టరేట్ అందజేశారు.

వికలాంగులకు చేయూత

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలో వికలాంగుల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని, వారికి అవసరమైన సహాయాన్ని అందించడానికి సిద్ధంగా ఉన్నామని ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు ప్రకటించారు. సోమవారం పట్టణంలోని ఆర్యవైశ్య ధర్మశాలలో మదర్ థెరీసా వికలాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాసభ జరిగింది. ఈ సమావేశంలో ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు మండవిల్లి సాంబశివరావు, ఇందుపూరి నారాయణరావు మాట్లాడుతూ వికలాంగులకు ఏ విధమైన సహాయం కావాలన్నా సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు మండవెల్లి బుజ్జి, పూసర్ల నారాయణరావు పాల్గొన్నారు.

రూ.70 లక్షలతో తాగునీటి ట్యాంకు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

పంచాయతీలో జెజెఎం పరిధిలో రూ.70 లక్షలతో 90 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు మంజూరైనట్లు గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బి.గౌరీశంకరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం వాటర్ ట్యాంకు నిర్మాణానికి సంబంధించి స్థలాన్ని శుభ్రం చేసే పనులు ప్రారంభించారు. రెండు మూడు నెలల్లో పనులు పూర్తిచేసే ప్రతి వీధికి స్వచ్ఛమైన తాగునీరు పూర్తిస్థాయిలో అందిస్తామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, విఆర్ఒ రామారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

11 నెలల జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి- సీతానగరం

మండలంలోని పెదంకలం పంచాయతీలో గ్రీన్ అంబాసిడర్లకు 11 నెలలుగా జీతాలు అందలేదని ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రీన్ అంబాసిడర్లు చింతాడ పైడయ్య, చింతాడ వెంకటి వాపోయారు. తక్షణమే స్పందించి వేతనాలు చెల్లించాలని ఎంపిడిఒకు మొరపెట్టుకున్నారు.

పతకాలు సాధించిన విద్యార్థులు

కరాటేలో 'సరస్వతి' విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి - కురుపాం

విశాఖపట్నంలో జరిగిన అంతర్రాష్ట్ర కరాటే పోటీలలో కురుపాంలోని సరస్వతి విద్యానికేతన్ విద్యార్థులు కె.సాత్విక్, కె.నిషిత సిల్వర్ మెడల్స్ సాధించారు. వీరికి నిర్వాహకులు బహుమతులు , ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వీరిని కరస్పాండెంట్ ఎన్.శ్రీనివాస్, ప్రిన్సిపల్ కె.శ్రీరామమూర్తి నాయుడు, కోచ్ నరేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-విజయనగరంలీగల్

ఈనెల 13న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత సూచించారు. సోమవారం జిల్లా కోర్టు పరిధిలో ఉన్న న్యాయమూర్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూరాజీ పడదగిన క్రిమినల్ కేసులను, మోటార్ ప్రమాద భీమా కేసులు, బ్యాంకు కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనీ కేసులు, ప్రామిసరీ నోట్ కేసులు, పర్మినెంట్ ఇంజక్షన్ దావాలు, ఎలక్ట్రిసిటీ కేసులు, ఎక్సైజ్ కేసులు, ల్యాండ్ కేసులు, కుటుంబ తగాదాలను రాజీ మార్గంలో శాశ్వత పరిష్కారం చేయాలని వివరించారు. సమావేశంలో న్యాయమూర్తులు ఎం.మీనాదేవి, కె.విజయ కళ్యాణి, బి.అప్పలస్వామి, ఎమ్ పద్మావతి, కె.నాగమణి శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ జి.దుర్గయ్య, జిల్లాన్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, పాల్గొన్నారు.

చిన్నారుల నిజాయితీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

సర్వేపల్లి విద్యా నికేతన్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు బొబ్బిలి హృషీకేశ్, బొబ్బిలి లాస్యశ్రీ తమకు దొరికిన పాతికవేల రూపాయల ఖరీదైన కొత్త సెల్ ఫోన్‌ను తండ్రి న్యాయవాది రామకృష్ణతో కలిసి ఆదివారం రాత్రి పదిన్నర సమయంలో కానిస్టేబుల్ పాపారావుకు స్టేషన్‌లో అందజేశారు. సెల్ ఫోన్ పోగొట్టుకున్న శిశెట్టి సామ్రాట్‌ను స్టేషన్‌కు పిలిపించి చిన్నారుల చేతులు మీదుగా సోమవారం ఆ సెల్‌ఫోన్‌ను అందించారు. చిన్నారుల నిజాయితీని, సామాజిక బాధ్యతను సిఐ వి.నారాయణమూర్తి, ఎస్ఐ యన్.సత్యనారాయణ, అభినందించారు.

పింఛనుతో పేదలకు ఆర్థిక భరోసా

మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు

ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛను నగదు అందజేయడం వల్ల పేదలకు ఆర్థిక భరోసా లభిస్తోందని మంత్రి సంధ్యారాణి తెలిపారు. సోమవారం పట్టణంలోని 11వ వార్డులో లబ్ధిదారులకు ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో నూతనంగా 38 పింఛన్లు మంజూరైనట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : తాడికొండ గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు అడ్డాకుల నరేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జగదీశ్వరి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్‌పర్సన్ కడ్రక కళావతి, ఎస్‌టి కమిషన్ సభ్యులు కడ్రక మల్లేశ్వరరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బిడ్డిక పద్మావతి, బిజెపి మండల కన్వీనర్ కడ్రక అప్పలస్వామి, తోటపల్లి దేవస్థానం సభ్యులు ఆరిక జానకి, ఎంపిడిఒ లక్ష్మి, సర్పంచ్ మండంగి జగ్గారావు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని దేవనపురం గ్రామంలో ఎమ్మెల్యే నిమ్మక జయక్రిష్ణ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఆ గ్రామంలోని పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. పెద్దరామ గ్రామంలో ఉన్న శిథిలావస్థకు చేరిన వంతెనను పరిశీలించారు. జగతిపల్లి గ్రామంలో కొత్తగా వేస్తున్న రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తేజోవతి, పవన్, ఎంపిడిఒ మిస్రో, తదితరులు పాల్గొన్నారు.

సాలూరులో వికలాంగుడికి పింఛను అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

గుమ్మలక్ష్మీపురం, సీతంపేట.. పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు జగదీశ్వరి, జయక్రిష్ణ

రోడ్డు నిర్మాణం చేపట్టాలని గిరిజనుల నిరసన

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని లుంబేసు పంచాయతీ గిరిశిఖర గ్రామమైన దేరుగండకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మండల నాయకులు ఎం.సన్యాసిరావు మాట్లాడుతూ రెండేళ్ల కిందట దేరుగండ గ్రామానికి మట్టి రోడ్డు ప్రారంభించి మధ్యలో ఆపేశారని గుర్తుచేశారు. గ్రామానికి రోడ్డు సదుపాయం లేకపోవడం వల్ల గర్భిణులను, రోగులను ఆస్పత్రికి తీసుకువెళ్లాలన్నా, సంతకు, రేషన్ డిపోకు వెళ్లి సరుకులు తీసుకువెళ్లాలన్నా ఆదివాసీలు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎగువ తాడికొండ నుంచి దేరుగండకు రోడ్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. యువజన సంఘం మండల నాయకులు బిడ్డక రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిపాలనా యంత్రాంగం

ఆరోగ్యం, శ్రేయస్సు ముఖ్యం

కలెక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డి

రక్షణ పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

జిల్లా పరిపాలనా యంత్రాంగం ఆరోగ్యం, శ్రేయస్సు తమకు ముఖ్యమని, అందుకే ఈ ప్రత్యేక వైద్య శిబిరమని జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా అధికారులు, సిబ్బంది కోసం జిల్లా సమన్వయ అధికారి ఏర్పాటుచేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో పాలుపంచుకుంటున్న ప్రతీ అధికారి, సిబ్బంది ఆరోగ్యం చాలా ముఖ్యమని అన్నారు. ఆరోగ్యవంతమైన సిబ్బంది మాత్రమే సమర్థవంతంగా పనిచేయగలుగుతారని చెప్పారు. ఇలాంటి శిబిరాలు వారి ఆరోగ్యాన్ని పర్యవేక్షించడంలో సహాయపడతాయని తెలిపారు. ఈ శిబిరంలో కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, గ్యాస్ట్రోలజీ, అంకాలజీ, జాయింట్ రీప్లేస్‌మెంట్, ఇసిజి, ఎకో, ఎండోస్కోపి వంటి పరీక్షలు నిర్వహించి అనుభవజ్ఞులైన వైద్యులతో చికిత్స అందిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు, డిసిహెచ్ఎస్ జి.నాగభూషణరావు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి ఎం.వినోద్ కుమార్, ప్రోగ్రాం మేనేజర్ టి.జగన్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో ముందస్తు జాగ్రత్తలపై శిక్షణ

పార్వతీపురంటౌన్ : విపత్తులు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో తక్షణమే స్పందించి రక్షణ చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి విపత్తుల నిర్వహణ అధికారిని ఆదేశించారు. ఇందుకోసం గ్రామస్థాయిలో వాలంటీర్లను ఏర్పాటుచేసుకొని, వారికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ద్వారా జిల్లాకు సరఫరా అయిన రక్షణ పరికరాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విపత్తుల శాఖ సామర్థ్యాన్ని మరింత పెంపొందించుకోవాలని సూచించారు.

పాఠశాల భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో గుమ్మ గదబవలస గ్రామంలో రూ.23 లక్షల వ్యయంతో పాఠశాల భవన నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సదుపాయాలను బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రాధాన్యతమన్నారు. ఆధునిక వసతులతో నిర్మితమయ్యే ఈ కొత్త భవనం విద్యార్థులకు ఉత్తమమైన విద్యా వాతావరణాన్ని కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్‌పర్సన్ కడ్రక కళావతి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్ కుమార్, ఎస్‌టి కమిషన్ సభ్యులు కడ్రక మల్లేశ్వరరావు, టిడిపి మండల కన్వీనర్ కె.వి.కొండయ్య, పిఎసిఎస్ ఛైర్మన్ డొల్లు కిశోర్, ఎంపిడిఒ ఉమామహేశ్వరి, ఐటిడిఎ జెఇ అప్పారావు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

తాడికొండలో..

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని తాడికొండ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల అదనపు భవన నిర్మాణానికి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శంకుస్థాపన చేశారు. పిఎం జన్‌మన్ నిధులు రూ.2.75 కోట్లతో పాఠశాల భవనం నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కాంట్రాక్టర్, నిర్మాణ సంస్థలు నాణ్యతకు ప్రాధాన్యమిచ్చి పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-సాలూరు

పార్వతీపురం ఆపరేషన్ డివిజన్ పరిధిలోని మామిడిపల్లి సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, ఆర్‌డిడిఎస్ పనుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఇఇ గోపాలరావునాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మామిడిపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని మామిడిపల్లి, కందులపదం, కరాసువలస, కొత్తవలస, అంటివలస, అన్నంరాజువలస, చిన్నవలస, పి ట్టాడవలస, తదితర గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ సాలూరు తాలూకా నూతన కార్యవర్గం

పిఆర్‌సి ప్రకటించాలి

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కిశోర్

ప్రజాశక్తి-సాలూరు

ఉద్యోగులకు పిఆర్‌సిని వెంటనే ప్రభుత్వం ప్రకటించాలని ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ మన్యం జిల్లా అధ్యక్షులు కిశోర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎన్‌జిఒ హోంలో సాలూరు తాలూకా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐఆర్ వెంటనే ప్రకటించాలని, గ్రామ సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్, సిహెచ్ఎస్‌లో లోపాలను సరిదిద్ది సరైన బీమా సదుపాయాన్ని కల్పించాలని కోరారు. ఎపిఎన్‌జిఒ సాలూరు తాలూకా అధ్యక్షులుగా డి.పద్మలత. అసోసియేట్ అధ్యక్షులుగా కె.నాగేంద్ర ప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఎం.చంద్రశేఖర్ షేక్ అబ్దుల్, జగ్గేన వికాస్, టి.రాము, కార్యదర్శిగా కె. శ్రీనివాసరావు, కోశాధికారిగా జి.సతీష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పూర్వ అధ్యక్షులు ఆకుల ప్రవీణ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కె.రంగాచారి, కె.సంగమేశ్వర రావు, ఎస్.వి.రమణ జి.నారాయణరావు, ఎపి వర్క్ చార్జ్ ఎంప్లాయీస్ అధ్యక్షుడు డిజి ప్రసాద్ రావు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు 27 వినతులు

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు 27 వినతులు అందాయి. డిప్యూటీ డిఇఒ రామ్మోహన్‌రావు, ఎఒ సునీల్ ఆధ్వర్యంలో వినతులు స్వీకరించారు. పింఛన్ల పునరుద్ధరణ, కొత్త పింఛన్ల కోసం వినతులు అధికంగా వచ్చాయి. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అప్పారావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సత్యం, డిఇ నాగభూషణం, హౌసింగ్ ఎఇ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న అధికారులు

తురాయిపాడు రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సాలూరు

మండలంలోని తోణాం పంచాయతీ తురాయిపాడు గ్రామానికి తారు రోడ్డు నిర్మాణానికి సోమవారం టిడిపి మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు బుస తవుడు, టి.తిరుపతిరావు, దొర లక్ష్మణ, రొంపల్లి వెంకటేష్, తౌడు, వెంకట్, లక్ష్మి, వెంకటరమణ, భాస్కర్ రాజు, సర్పంచ్ మువ్వల ఆదియ్య, ఎంపిటిసి పెంటయ్య పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న టిడిపి మండల అధ్యక్షులు పరమేష్